టీ-మీడియా
Digital, tmedia.net.in
TMEDIA నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...
11వ వార్షికోత్సవం 2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!
tmedia.net.in
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5
GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN
గురువారం 17/09/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


# 12 ఏళ్లు సంస్థ కోసం కష్టపడి నా తీసేశారు




**⏭ ఒరాకిల్ లేఆఫ్స్ వెనుక కన్నీటి గాథలు!**

**టి మీడియా ,సెప్టెంబర్ 16 ,డిల్లీ బ్యూరో :**
హోలీ లేదు, దీపావళి లేదు– పండగైనా, పబ్బమైనా ల్యాప్‌టాప్ ముందే జీవితం. పుట్టినరోజులు, పెళ్లి రోజుల వేడుకల్లోనూ ఆన్ కాల్ డ్యూటీలు. చివరికి భార్యకు ఆస్పత్రిలో సర్జరీ జరుగుతున్న సమయంలో కూడా ఒకవైపు ఆందోళన ఉన్నా, మరోవైపు ల్యాప్‌టాప్ ఓపెన్ చేసి డ్యూటీ చేశాడు. సంస్థ పట్ల అంత నిబద్ధతతో ఏకంగా 12 ఏళ్లు రాత్రింబవళ్లు చెమటోడ్చిన ఆ ఉద్యోగికి చివరికి దక్కిన బహుమానం ఏంటో తెలుసా? ఉదయాన్నే ఆఫీస్ సిస్టమ్ యాక్సెస్ నిలిచిపోవడం. లాగిన్‌కు ప్రయత్నిస్తుండగా ఎంతకూ యాక్సెస్ లభించలేదు. ఆ తర్వాతే తెలిసింది అతడు లేఆఫ్‌కు గురయ్యాడని. అమెరికా టెక్సాస్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న మల్టీనేషనల్ టెక్ దిగ్గజం ఒరాకిల్‌లో కొనసాగుతున్న లేఆఫ్స్ (ఉద్యోగుల తొలగింపులు) సృష్టిస్తున్న విషాదానికి ఈ సంఘటన నిలువెత్తు నిదర్శనం. 12 ఏళ్లు కష్టపడి పనిచేసిన సౌరభ్ అనే ఉద్యోగికి కనీస ముందస్తు సమాచారం ఇవ్వకుండానే, సిస్టమ్ లాగిన్ నిలిపివేయడంతో అతడి బాధ వర్ణనాతీతంగా మారింది. ఈ నేపథ్యంలో ఆ ఉద్యోగి ఆవేదనను తన భార్య పూజా సాహు లింక్డ్‌ఇన్‌లో ఇలా భావోద్వేగంతో సుదీర్ఘ పోస్ట్ చేశారు.
ఇక్కడ సౌరభ్ ఒక్కడే కాదు. ఒరాకిల్ లేటెస్ట్ రౌండ్ లేఆఫ్స్‌లో ఉద్యోగాలు కోల్పోయిన వారు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు లింక్డ్ ఇన్, రెడిట్ సహా ఇతర సామాజిక మాధ్యమాల్లో తమ అనుభవాలు, ఆవేదనను పంచుకుంటున్నారు. సడెన్‌గా ఉద్యోగం కోల్పోవడం, భవిష్యత్తుపై అనిశ్చితి, ఎన్నో ఏళ్ల జాబ్ కెరీర్ ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోవడం వంటి అంశాలు ఈ పోస్టుల్లో కనిపిస్తున్నాయి. అయితే కొందరు లేఆఫ్స్‌కు గురైన బాధితులు ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే బాధపడ్డా, భవిష్యత్ అవకాశాల కోసం వెతుకుతున్నట్లు చెప్పుకొచ్చారు.

**సెప్టెంబర్ 14న ఒరాకిల్ లేఆఫ్స్**

ఇప్పటికే ఈ ఏడాదిలో మార్చిలో భారీ స్థాయిలో లేఆఫ్స్ ప్రకటించి కలకలం రేపిన ఒరాకిల్– ఇప్పుడు సెప్టెంబర్ 14న మరో రౌండ్ లేఆఫ్స్ ప్రారంభించినట్లు తెలుస్తోంది. బాధిత ఉద్యోగులకు సెప్టెంబర్ 14న ఉదయమే సమాచారం అందినట్లు పలు మీడియాల్లో కథనాలు వచ్చాయి. అయితే తాజా విడతలో కచ్చితంగా ఎంత మందిని తొలగించిందనే దానికి సంబంధించి క్లారిటీ లేదు. ఇక 2025–2026 ఆర్థిక సంవత్సరంలో ఒరాకిల్ ఉద్యోగుల సంఖ్య ఏకంగా 21 వేలు తగ్గింది. ఇది తన గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో దాదాపు 13 శాతం. కంపెనీ తన విస్తృత పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగానే ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లు చెబుతూ వస్తోంది. ఇటు ఉద్యోగుల్ని తొలగిస్తూనే, మరోవైపు ఆర్టిఫిషియల్ (మిగతా 2లో)

# బీఆర్ఎస్ నేతలు భూములను బదిలీ చేసుకున్నారు

**⏭ ధరణి ద్వారా సమాచారాన్ని మాఫియా చేతికి**

**⏭ సీఎం రేవంత్ రెడ్డి**

**టి మీడియా ,సెప్టెంబర్ 16 , హైదరాబాద్ బ్యూరో:**
ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు.



**ధరణితో ఇష్టారాజ్యంగా భూముల బదిలీ**

ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పు చేసిన వారు సభకు రాకుండా తప్పించుకుందామనే చూస్తారని సీఎం ఎద్దేవా చేశారు. పట్టుకుని రమ్మని ఆదేశాలిస్తే తప్ప కేసీఆర్ సభకు వచ్చేటట్టు లేరని అన్నారు. రెవెన్యూ సమాచారం కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. రూ. 110 కోట్ల విలువైన (మిగతా 3లో)

# విజయవాడలో ఆలయ భూములు కబ్జా

**⏭ దేవాదాయ శాఖ నిర్లక్ష్యం**

**టి మీడియా ,సెప్టెంబర్ 16 , విజయవాడ :**
కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో దుర్గ గుడి సహా అనేక ఆలయాలకు చెందిన భూములు ఆక్రమణకు గురయ్యాయి. విజయవాడ, శివారు ప్రాంతాల్లో వందల కోట్ల రూపాయల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయి. దశాబ్దాలుగా దేవాదాయ శాఖ పర్యవేక్షణ లోపించడమే ఇందుకు కారణం.

**అధికారుల విఫలం**

ఈనాం, ఆర్ఎస్ఆర్, దేవాదాయ శాఖకు చెందిన 43/10 రిజిస్టర్లలో స్పష్టంగా దేవాదాయశాఖ భూములేనని ఉన్నా వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. దేవాదాయశాఖకు చెందిన 43/10 రిజిస్టర్‌లో నమోదైన భూములు కబ్జా కాకుండా, క్రయవిక్రయాలు జరగకుండా చర్యలు చేపట్టే అవకాశమున్నా అధికార యంత్రాంగంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈ భూముల జాబితాను 22ఎ1సిలో చేర్చాలని కలెక్టర్‌కు నివేదిక అందిస్తే రెవెన్యూ సిబ్బంది చర్యలు చేపడతారు. ఈ విషయంలో రెండు జిల్లాల దేవాదాయశాఖ అధికారులు విఫలమవుతున్నారు.

**ఫసలీ నంబర్ల ప్రకారం**



విజయవాడలోని పట్టాభిరామస్వామి ఆలయానికి చెందిన రూ.25 కోట్లకు పైగా విలువైన 1.96 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. గొల్లపూడిలోని గ్రామ రీసర్వే నంబరు 528/3లో ఉన్న భూమిని ఫసలీ నంబరు 1,402, 1,407, 1,413లో మ్యాన్యువల్ అడంగల్, వెబ్ అడంగల్‌లో ప్రైవేటు వ్యక్తులు తమ పేర్లపైకి మార్చేసుకున్నారు. ఫసలీ నంబర్ల ప్రకారం చూస్తే 1992, 1997, 2003 సంవత్సరాల్లో ఈ కబ్జాలు జరిగాయి. 2011లో ఆరుగురి పేర్లతో భూమిని రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. 1946లో పినిశెట్టి వెంకమ్మ ఈ భూమిని ఆలయానికి దానమిచ్చారు. దేవాదాయ శాఖకు చెందిన 43/10 సహా అన్ని రికార్డుల్లోనూ (మిగతా 2లో)

# పెళ్లైన 15 రోజులకే విషాదం..

**⏭ అమెరికాలో హైదరాబాద్ యువకుడి మృతి**

**టి మీడియా ,సెప్టెంబర్ 16 , హైదరాబాద్ బ్యూరో :**
హైదరాబాద్ పాతబస్తీలోని సంతోష్‌నగర్‌కు చెందిన మహమ్మద్ జాబీర్ హుస్సేన్ సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. గత ఐదేళ్లుగా అమెరికాలోని టెక్సాస్‌లో ఓ ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవలే జాబీర్ వివాహం జరిగింది. అమెరికన్ సిటిజన్‌షిప్ ఉన్న యువతితో సుమారు 15 రోజుల క్రితం ఆయన వివాహం జరిగినట్లు సమాచారం. పెళ్లి అనంతరం భార్యతో కలిసి కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు జాబీర్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భార్య ప్రస్తుతం తన తల్లిదండ్రుల వద్ద ఉంటున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆమెతో కలిసి ఉండేందుకు టెక్సాస్‌లో జాబీర్ ఇంటి కోసం కూడా వెతుకుతున్నట్లు తెలిపారు.

**అసలేం జరిగిందంటే?**

కొత్త జీవితంపై ఎన్నో ఆశలతో ముందుకు సాగుతున్న సమయంలోనే జాబీర్ అనూహ్యంగా మృతి చెందారు. ఆయన తాను ఉంటున్న గదిలోనే మృతి చెందినట్లు స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. జాబీర్‌కు



గుండెపోటు వచ్చి ఉండొచ్చని ప్రాథమికంగా తెలుస్తోందని స్నేహితులు చెప్పినట్లు సమాచారం. అయితే ఆయన మృతికి గుండెపోటే కారణమా? మరేదైనా కారణం ఉందా? అనే విషయం అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. స్నేహితులు గది తలుపు తెరిచి చూసే సమయానికి జాబీర్ నేలపై మృతదేహంగా కనిపించినట్లు చెబుతున్నారు. (మిగతా 2లో)

# ఈపీఎఫ్‌వో వేతన పరిమితిని పెంచుతూ కేబినెట్ నిర్ణయం




**⏭ రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంపు**

**టి మీడియా ,సెప్టెంబర్ 16 ,డిల్లీ బ్యూరో :**
ఈపీఎఫ్‌వో వేతనదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఈపీఎఫ్‌వో వేతన పరిమితిని 15వేల నుంచి 25వేలకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో (మిగతా 2లో)

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ

**⏭ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన**

**టి మీడియా ,సెప్టెంబర్ 16 , హైదరాబాద్ బ్యూరో :**
మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి 30 రోజుల్లో విచారణ జరపాలని స్పష్టం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో 295 ఎకరాల భూమి ఉందని తెలిపారు. అసెంబ్లీలో 22ఏ అంశంపై చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ భూముల వివరాలు వెల్లడించారు. గత ప్రభుత్వంలో అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపించారు.700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందా లేదా తేల్చాలని స్పష్టం చేశారు. 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతానని, శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి యజమానులను చేస్తానని ఘంటాపథంగా చెప్పారు.

భూముల వివరాలు

| కుటుంబం | కుటుంబ సభ్యులు | ప్రాంతాలు | భూములు |
|---|---|---|---|
| కేసీఆర్ కుటుంబం | కేసీఆర్, ఆయన భార్య | సిద్దిపేట జిల్లా; ఎర్రవల్లి, మిట్టపల్లి, శివార్ వెంకటాపూర్ | 67.13 ఎకరాలు |
| కేటీఆర్ కుటుంబం | కేటీఆర్, ఆయన భార్య శైలిమ, కుమార్తె అలేఖ్య, కుమారుడు హిమాన్షు రావు | సిద్దిపేట, రంగారెడ్డి జిల్లాలు; ఎర్రవల్లి, జన్వాడ, మర్కూక్, శివార్ వెంకటాపూర్ | 123.19 ఎకరాలు |
| కవిత కుటుంబం | కవిత, ఆమె భర్త | మహబూబ్‌నగర్, రంగారెడ్డి, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలు; 8 మండలాలు, 8 గ్రామాలు | 37.26 ఎకరాలు |
| హరీశ్‌రావు కుటుంబం | హరీశ్‌రావు, ఆయన భార్య | రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలు; మిట్టపల్లి, నందిపల్లి, రామంచ, అజీజ్‌నగర్ | 30.16 ఎకరాలు |
| జోగినిపల్లి కుటుంబం | రవీందర్‌రావు, సంతోష్‌కుమార్, సంతోష్‌కుమార్ భార్య రోహిణి | 5 జిల్లాలు; 9 మండలాలు; 12 గ్రామాలు | 79.20 ఎకరాలు |
| నవీన్‌కుమార్–కొండల్‌రావు కుటుంబం | నవీన్‌కుమార్, కొండల్‌రావు | మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలు; 7 మండలాలు, 9 గ్రామాలు | 101.14 ఎకరాలు |
| మొత్తం | | 9 జిల్లాలు – 24 మండలాలు – 31 గ్రామాలు | 439.30 ఎకరాలు |

**త్వరలోనే ధరణి పార్ట్–2 అక్రమాలు బయటపెడతాం**

మొత్తం రూ.లక్ష కోట్ల భూకుంభకోణం జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూకుంభకోణంపై స్పెషల్ ఎంక్వయిరీ టీమ్ (ఎస్ఈటీ), మొత్తం (మిగతా 2లో)

# వినాయక నిమజ్జనంలో విషాదం..



**● ఆరుగురు విద్యార్థుల దుర్మరణం!**

**టీ మీడియా, సెప్టెంబర్ 16,సంగారెడ్డి:**

వినాయక నిమజ్జన వేడుకల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గణనాథుడి నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లాలో కలకలం రేపింది. పెద్దకంజర్లలోని నేరెడుచెరువులో ఈ విషాద ఘటన జరిగినట్లు సమాచారం. మృతులంతా శిరీష చారిటబుల్ ట్రస్ట్‌లో చదువుతున్న విద్యార్థులుగా తెలుస్తోంది.వినాయక చవితి ఉత్సవాల అనంతరం విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చెరువు వద్దకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. అయితే విద్యార్థులు నీటిలో ఎలా దిగారు? ప్రమాదానికి అసలు కారణం ఏమిటి? ఒకేసారి ఎంతమంది నీటిలోకి వెళ్లారు? అనే అంశాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానిక అధికారులు అక్కడికి చేరుకున్నారు. చెరువులో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనతో పెద్దకంజర్లతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.వినాయక నిమజ్జన వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిన తమ పిల్లలు తిరిగి వస్తారని ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఈ విషాద వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. విద్యార్థుల మృతితో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతుల కుటుంబాలకు సంబంధించిన పూర్తి వివరాలు, వయస్సు, విద్యార్థుల స్వస్థలాలు వంటి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిమజ్జన సమయంలో భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? విద్యార్థులు చెరువు వద్దకు ఏ విధంగా చేరుకున్నారు? అనే అంశాలను అధికారులు పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.ఇటీవల తెలంగాణలో వినాయక నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో చెరువులు, జలాశయాల వద్ద భద్రతా చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోనూ వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని గతంలో సూచనలు చేశారు.

# కన్న కొడుకి కర్కశం..

**● వృద్ధ దంపతులను ఇంటి నుంచి గెంటేసి**

**టీ మీడియా, సెప్టెంబర్ 16,కరీంనగర్:**



వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు అండగా నిలవాల్సిన కుమారుడితోనే ఆస్తి వివాదం తలెత్తడంతో ఓ వృద్ధ దంపతులు ఇంటి ముందే బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన ఘటన కరీంనగర్‌లో చోటుచేసుకుంది. “ఈ వయసులో మేమెక్కడికి వెళ్లాలి.. మా పరిస్థితిని అర్థం చేసుకుని న్యాయం చేయండి” అంటూ వారు అధికారులను వేడుకున్నారు. కోతిరాంపూర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.జమ్మికుంట మండలం వావిలాల గ్రామానికి చెందిన దేవులపల్లి లక్ష్మణ్ 2010లో ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు కుమారుడు రవికుమార్, కుమార్తె ఉన్నారు. రవికుమార్ హైదరాబాద్‌లో ఏరోస్పేస్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. నెలకు సుమారు రూ.8 లక్షల వరకు వేతనం వస్తుందని వృద్ధ దంపతులు తెలిపారు. కరీంనగర్ కోతిరాంపూర్‌లో లక్ష్మణ్ 2002లో నిర్మించుకున్న ఇంటిని అనంతరం తన కుమారుడు రవికుమార్ పేరున గిఫ్ట్ డీడ్ చేసినట్లు వారు చెప్పారు. అయితే 2023 నుంచి ఆ ఇంటిని విక్రయించాలని కుమారుడు చెబుతున్నాడని, ఇంటిని ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఒత్తిడి చేస్తున్నాడని తల్లిదండ్రులు ఆరోపించారు. ప్రస్తుతం ఆ ఇంటి అద్దె ద్వారా వచ్చే ఆదాయమే తమకు ప్రధాన ఆధారమని దంపతులు తెలిపారు. వృద్ధాప్యంలో ఇంటి నుంచి వెళ్లిపోవాల్సి వస్తే తాము ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య జయలక్ష్మి గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆమెకు వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఉందని లక్ష్మణ్ తెలిపారు. తమకు ఆధారంగా ఉన్న ఇంటిపై చేసిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి, వృద్ధాప్యంలో తమకు రక్షణ కల్పించాలని అధికారులను కోరారు. కుమారుడితో ఏర్పడిన ఆస్తి వివాదాన్ని పరిష్కరించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.కాగా, గిఫ్ట్ డీడ్ విషయంలో చట్టపరమైన అంశాలు, ఇరువర్గాల హక్కులు, వివాదానికి సంబంధించిన ఇతర వివరాలు అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. వృద్ధ దంపతుల ఆరోపణలపై కుమారుడి స్పందన కూడా తెలియాల్సి ఉంది.

# విజయవాడలో ఆలయ భూములు కబ్జా

(మొదటి పేజీ తరువాయి)

ఆలయం పేరుతోనే ఈ భూమిని నమోదు చేయించారు.

**శిథిలమైన ఆలయం, మఠం భూములు**

భవానీపురంలోని కుమార సిద్ధయ్యస్వామి మఠానికి చెందిన రూ.150 కోట్లకు పైగా విలువైన భూములు ఆక్రమణల్లో చిక్కుకున్నాయి. ఈ ప్రాంతంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, ఆ పక్కనే కుమార సిద్ధయ్యస్వామి మఠం ఉండేవి. టైటిల్ డీడ్ నంబరు 167లో పాత సర్వే నంబరు 57, ఆర్ఎస్ఆర్ నంబరు 84/1లో స్పష్టంగా ‘కుమార సిద్ధయ్యమఠం పేరుతో 14.97 ఎకరాల భూమి ఉండేది. ప్రస్తుతం ఆలయం, మఠం శిథిలమైపోయాయి. భూములను కొందరు ఆక్రమించారు. ఎకరా రూ.10 కోట్లకుపైనే పలుకుతోంది.

**రూ. 100 కోట్లకు పైగా విలువ**

విజయవాడ మధ్య నియోజకవర్గంలోని అన్నదాన సమాజం ట్రస్ట్‌కు చెందిన రూ.100 కోట్లకు పైగా విలువైన 146.68 ఎకరాలు కైకలూరులో ఉన్నాయి. అన్నదానం కోసం 1967లో ఏర్పాటైన ట్రస్ట్‌కు పలువురు భారీగా విరాళాలిచ్చారు. కైకలూరు పరిధిలోని పెరికిగూడెంలో 146.68 ఎకరాల భూమి ట్రస్ట్‌కు దాతల ద్వారా సమకూరింది. సర్వే నంబర్లు 445, 448, 621, 626, 627, 630, 631, 633, 636, 639, 640, 641, 643 నుంచి 652, 658, 659ల్లో ఈనాం భూములుగా ఇవి రికార్డుల్లో నమోదయ్యాయి. ఇవి ఆక్రమణ చెరలో చిక్కుకున్నాయి.విజయవాడలోని మాచవరం దాసాంజనేయస్వామి ఆలయానికి ఆనుకుని ఉత్తరంవైపు ఉన్న 820 గజాల స్థలం ఆక్రమణల పాలైంది. మార్కెట్ ధర ప్రకారం గజం రూ.లక్ష ఉంది. ఎన్‌టీఎస్ నంబరు 109 పరిధిలో 3,602 చ.అ. భూమి, ఎన్‌టీఎస్ నంబరు 116లో 3,707 చ.అ. భూమి ఆక్రమణల్లో చిక్కుకున్నాయి. ఇవీ దాసాంజనేయస్వామి ఆలయానికి చెందినవే.

గూడవల్లిలోని కోదండరామస్వామి గుడికి సంబంధించిన 2.70 ఎకరాలను బుడమేరు కాలువ విస్తరణకు గతంలో తీసుకున్నారు. అలా తీసుకున్న మిగతా భూములకు పరిహారాన్ని ఆరేళ్ల కిందటే ఇచ్చేశారు. ఆలయానికి మాత్రం పరిహారం ఇప్పటికీ ఇవ్వలేదు.

**దుర్గ గుడి భూములు 11.54 ఎకరాలు :**

విజయవాడ దుర్గ గుడికి చెందిన 11.54 ఎకరాలు నగరంలోని సత్యనారాయణపురం 112 సర్వే నంబరు పరిధిలో ఉండేవి. ఆర్ఎస్ఆర్, 43/10, ఈనాం రిజిస్టర్‌ల్లో ఇవి దుర్గగుడికి చెందిన భూములుగానే నమోదయ్యాయి. ఈ భూమి విలువ రూ.200 కోట్లపైనే. దీనిని 22ఎ1సి కింద చేర్చాలని దేవాదాయశాఖ నుంచి కలెక్టర్‌కు దస్త్రం సమర్పించారు. ఆ తర్వాత దీనిపై ఎలాంటి స్పందనా లేదు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

భూకుంభకోణంపై నెలరోజుల్లో నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు చెప్పింది ధరణి పార్ట్– 1 మాత్రమేనని, త్వరలోనే ధరణి పార్ట్–2 అక్రమాలు బయటపెడతామని వెల్లడిచారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉన్నప్పుడే అన్నీ బయటపెడతామని తెలిపారు. ఈసారి సమావేశాలకు బీఆర్ఎస్ సభ్యులు వచ్చేలా స్పీకర్ చూడాలని కోరారు. తన కళ్లల్లోకి చూసి మాట్లాడే ధైర్యం వాళ్లకు ఉండదని, టీజీఐఐసీ భూముల్లో జరిగిన అక్రమాలను బడ్జెట్ సెషన్‌లో బయటపెడతామని స్పష్టం చేశారు.

“ఒక కుటుంబానికి కుష్కి పొలం 54, తరి పొలమైతే 27ఎకరాలుండాలి. కేసీఆర్‌కు ఉన్నది మొత్తం తరి పొలమే. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో కేసీఆర్, శోభిత పేరిట 67.5 ఎకరాలు. కేటీఆర్ పేరు మీద 49.5 ఎకరాలు, శైలిమ పేరిట 17.5ఎకరాలు. కేటీఆర్ పిల్లలు అలేఖ్య పేరిట 9.38, హిమాన్షు పేరిట 46.23 ఎకరాలు. కేటీఆర్ కుటుంబానికి మొత్తం 123.19 ఎకరాలు ఉంది” – రేవంత్ రెడ్డి, సీఎం

హరీశ్‌రావుకు రంగనాయకసాగర్ పరిధిలో భూమి ఉందని, రంగనాయకసాగర్ ప్రాంతంలో హరీశ్‌రావు భూమి కొన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. రిజర్వాయర్ కోసం ఇరిగేషన్ శాఖ భూసేకరణ చేసిందని, హరీశ్‌రావు కొన్న భూమిని భూసేకరణ జాబితాలోంచి తర్వాత తొలగించారని, రామంచ సర్వే నం.4.20 ఎకరాలకు గాను ఒక ఎకరం తీసుకున్నారని పేర్కొన్నారు. భూసేకరణ రైతలకు ఎకరాకు రూ.6.20 లక్షల చొప్పున చెల్లించిందని, హరీశ్‌రావు మాత్రం రైతుల నుంచి రూ.2.50 లక్షల చొప్పున కొనుగోలు చేసినట్లు రికార్డులు ఉన్నాయని, రంగనాయకసాగర్ ఫామ్‌హౌస్‌కు రూ.5.33 కోట్లతో బీటీ రోడ్డు వేయించుకున్నారని, సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో టెండర్లు కూడా లేకుండా రోడ్డు వేయించుకున్నారని వెల్లడించారు.

# దంపతుల ఆత్మహత్య





**⏭ అనాథలైన ఇద్దరు చిన్నారులు**

**టీ మీడియా, సెప్టెంబర్ 16,ఖమ్మం :**

జిల్లా కొణిజర్లలో కుటుంబ కలహాలతో తేజావత్ హరిప్రసాద్, సునీత దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. భర్త కెనాల్‌లో దూకగా, వార్త విని భార్య ఇంట్లో ఉరి వేసుకుంది. ఈ విషాద ఘటనతో వారి ఇద్దరు పసిపిల్లలు అనాథలయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ హృదయ విదారక సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

కొణిజర్ల మండలం అమ్మపాలెం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. భర్త మృతి చెందిన విషయం తెలిసిన కొద్దిసేపటికే భార్య కూడా ఆత్మహత్య చేసుకోవడంతో ఇద్దరు చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయారు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.అమ్మపాలెం గ్రామానికి చెందిన తేజావత్ హరిప్రసాద్, సునీత దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. హరిప్రసాద్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు కొనసాగుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం (సెప్టెంబర్ 16) ఉదయం హరిప్రసాద్ తన ఆటోలో ఇద్దరు పిల్లలను పాఠశాలకు పంపించాడు. అనంతరం ఖమ్మం ఎస్సార్ గార్డెన్ సమీపంలోని ఎన్ఎస్‌పీ కెనాల్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచి తన అన్నకు ఫోన్ చేసి కుటుంబ కలహాల కారణంగా కాలువలో దూకి చనిపోతున్నానని చెప్పినట్లు సమాచారం. ఆ తర్వాత హరిప్రసాద్ కెనాల్‌లోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టాలని పోలీసులను ఆశ్రయించారు.

**భర్త మృతి వార్త విని.. ఇంట్లో**

హరిప్రసాద్ ఆత్మహత్య చేసుకున్న విషయం కుటుంబ సభ్యుల ద్వారా భార్య సునీతకు తెలిసింది. ఈ వార్తతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దంపతులు ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. తల్లిదండ్రుల మరణంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు. చిన్నారుల పరిస్థితి చూసి బంధువులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

**కెనాల్‌లో హరిప్రసాద్ కోసం గాలింపు**

హరిప్రసాద్ కెనాల్‌లో దూకిన విషయం తెలియడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కెనాల్‌లో నీటి ప్రవాహం, పరిస్థితులను పరిశీలిస్తూ మృతదేహం కోసం గాలిస్తున్నారు. మృతదేహం లభించిన తర్వాత తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కొణిజర్ల ఎస్సై సూరజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దంపతుల ఆత్మహత్యకు దారితీసిన కుటుంబ కలహాలు, ఇతర కారణాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## 12 ఏళ్లు సంస్థ కోసం కష్టపడి నా తీసేశారు

(మొదటి పేజీ తరువాయి)

ఇంటెలిజెన్స్, క్లౌడ్ సేవల కోసం డేటా సెంటర్లు, మౌలిక సదుపాయాలపై పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది.

**భారత్‌లోని ఉద్యోగులపైనా ప్రభావం?**

ఒరాకిల్‌కు భారత్‌లోనూ పెద్ద స్థాయిలోనే కార్యకలాపాలు ఉన్నాయి. ప్రొడక్ట్ ఇంజినీరింగ్, సపోర్ట్ అండ్ డెవలప్‌మెంట్ వంటి విభాగాల్లో వేలాది మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మార్చిలో లేఆఫ్స్ సమయంలో భారత్‌లో కూడా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ప్రభావితమయ్యారు. ఓవరాల్‌గా అప్పుడు ఒరాకిల్ 30 వేల మందిని తొలగించినట్లు వార్తలు రాగా, భారత్‌లోనే 12 వేల మంది ఉన్నట్లు తెలిసింది. అందుకే ఈ రౌండ్ లేఆఫ్స్‌లో కూడా భారత్‌లోని ఉద్యోగులు ఉండే ప్రమాదం ఉందని పరిశ్రమ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

# పెళ్లైన 15 రోజులకే విషాదం..

(మొదటి పేజీ తరువాయి)

ఘటన జరిగిన సమయంలో ఆయనకు వెంటనే వైద్య సహాయం అందిందా లేదా అనే వివరాలు కూడా ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉంది. జాబీర్ మృతికి అసలు కారణం పోస్టుమార్టం, వైద్య నివేదికలు వచ్చిన తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**కొత్త జీవితంపై ఆశలు.. ఇంతలోనే విషాదం**

పెళ్లయి 15 రోజులు కూడా పూర్తికాకముందే జాబీర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కుమారుడి పెళ్లి వేడుకల జ్ఞాపకాలు ఇంకా కళ్లముందే ఉండగానే అతడి మరణవార్త వినాల్సి రావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. భార్యతో కలిసి కొత్త ఇంట్లో కొత్త జీవితాన్ని ప్రారంభించాల్సిన సమయంలో జాబీర్ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడం కుటుంబ సభ్యులను తీవ్రంగా కలచివేసింది. తమ కుమారుడి మృతదేహాన్ని భారత్‌కు తీసుకురావడం కంటే ముందుగా అమెరికాకు వెళ్లి చివరిసారిగా ఆయనను చూసుకోవాలని జాబీర్ తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. జాబీర్‌కు చివరి చూపు చూసి, అక్కడే అంత్యక్రియలు నిర్వహించేందుకు తమకు, తమ కుమార్తెకు అమెరికా వెళ్లేందుకు అవసరమైన వీసా సదుపాయం కల్పించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు సమాచారం. ఈ విషాద సమయంలో తమకు అవసరమైన సహాయం అందించి, చివరిసారిగా కుమారుడిని చూసుకునే అవకాశం కల్పించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**కేంద్రానికి ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ లేఖ**

జాబీర్ కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితిపై స్పందించిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు సమాచారం. జాబీర్ తల్లిదండ్రులు, చెల్లెలు అమెరికాకు వెళ్లి తమ కుటుంబ సభ్యుడికి చివరి చూపు చూసేలా అవసరమైన సహాయం అందించాలని ఆయన కేంద్రాన్ని కోరినట్లు తెలుస్తోంది. ఒకవైపు కుమారుడి పెళ్లి జ్ఞాపకాలు.. మరోవైపు చివరిసారిగా కుమారుడిని చూసుకునేందుకు ఎదురుచూపులు.. జాబీర్ కుటుంబాన్ని ఈ విషాదం తీవ్రంగా కుదిపేసింది. ఆయన మృతికి సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక వైద్య నివేదికలు వెలువడిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఈపీఎఫ్‌వో వేతన పరిమితిని పెంచుతూ కేబినెట్ నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)ద

అదనంగా 51 లక్షల మంది ఈపీఎఫ్‌వో పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగుల సామాజిక భద్రతా పరిధిని మరింత విస్తరించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర సమాచారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వేతన పరిమితి పెంపుతో ప్రభుత్వంపై ఏటా సుమారు 11వేల339 కోట్ల రూపాయల మేర అదనపు భారం పడనుందని వెల్లడించారు. పీఎఫ్ పరిధిని విస్తరించడం ద్వారా ఉద్యోగులకు మరింత సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని అశ్వినీ వైష్ణవ్ వివరించారు. కంపెనీలు, యాజమాన్యాలు తమ సిబ్బందిని దీర్ఘకాలం పాటు తమవద్దే కొనసాగించుకునేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# పని భారాన్ని తగ్గించాలి



**⏭|డిపోవద్ద ఎస్ డబ్ల్యూ ఎఫ్ ధర్నా డిమాండ్**

**టీ మీడియా,సెప్టెంబర్16, ఖమ్మం:**

ఆర్టీసీ కార్మికుల ఐక్య పోరాటాల వేదిక స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47 వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక సిహెచ్.వి.రామయ్య స్మారక భవనం వద్ద ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ఖమ్మం రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు పతాకావిష్కరణ చేయగా ప్రతినిధులందరూ పతాకానికి రెడ్ సెల్యూట్ చేశారు.అనంతరం రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఖమ్మం డిపో వద్ద కార్మికులపై పెంచిన పని భారాన్ని తగ్గించాలని,స్థానిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.గడ్డం వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి మాట్లాడుతూ, తెలంగాణ ఆర్టీసీలో కార్మికులపై యాజమాన్య విధానాల వలన విపరీతమైన పని భారం పెరిగిందన్నారు.కార్మికులు ఐక్యంగా గత ఏప్రిల్ లో మూడు రోజుల సమ్మె సందర్భంలో అన్ని సంఘాల తో చర్చించి కొన్ని అంశాల పరిష్కారానికి ఒప్పుకుందన్నారు. రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు ఉపాధ్యక్షులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు ప్రచార కార్యదర్శి తోకల బాబు లు మాట్లాడుతూ ఖమ్మం రీజియన్ లో అనేక సమస్యలు కార్మికులు ఎదుర్కొంటున్నారని,హైదరాబాద్ సిటీలో ఎక్కువ రిక్వెస్ట్ స్టేజీలు పెట్టటం వలన డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.అనంతరం ఖమ్మం డిపో కార్యదర్శి గుగ్గిళ్ల రోశయ్య మాట్లాడుతూ స్థానికంగా డిపోలో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారుడిపో స్థాయిలో పెంచిన సర్వీసుల వివరాలు మరియు సమస్యలు పరిష్కారం చేయాలని కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్ సత్యనారాయణ కు కార్మిక సమస్యలపై యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్.వి.బాబు,ఓ.రాంబాబు,ఎస్.ఎస్.రామయ్య,జే.యు.చారి,పగిళ్లపల్లినరసింహారావు,సి.హెచ్.వీరయ్య,కె.వెంకన్న,ఐ.ముత్తయ్య,జి.వెంకటేశ్వర్లు,కే.శ్రీను,వీరేందర్ రావు,యన్వీ చారి,ఏ.శ్రీనివాసు,డి.నాగయ్య,రాజనాల నాగమల్లేశ్వరరావు,బి సుధాకర్,ఎం.వసంత రెడ్డి,రంగా రామారావు,ఎం.వెంకటేశ్వర్లు,పి. విజయ్ కుమార్,కృష్ణమూర్తి కే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాపురానికి రానని చెప్పిందని దారుణం..

**⏭|భార్య ముక్కు కొరికేసిన భర్త!**



**టి మీడియా ,సెప్టెంబర్ 16 , మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంలో ఈ భయంకర ఘటన వెలుగుచూసింది. కోటపల్లికి చెందిన మమతకు, మల్లంపేట గ్రామానికి చెందిన మణి చందర్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ముద్దులొలికే ఆడపిల్లలు ఉన్నారు. ఎనిమిదేళ్ల పాటు సాఫీగానే సాగిన వీరి సంసారంలో కొద్దిరోజుల క్రితం మనస్పర్థలు మొదలయ్యాయి. గొడవలు తీవ్రమవ్వడంతో భర్తతో వేగలేక మమత తన ఇద్దరు పిల్లలతో కలిసి కోటపల్లిలోని పుట్టింటికి వచ్చేసింది. భార్య పుట్టింటికి వెళ్ళిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన భర్త మణి చందర్.. ఎలాగైనా ఆమెను కాపురానికి తీసుకువెళ్లాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే కోటపల్లిలోని అత్తగారింటికి వచ్చాడు.

తనతో పాటు కాపురానికి రావాలంటూ భార్య మమతపై తీవ్ర ఒత్తిడి తెచ్చాడు. అయితే మనస్పర్థలు తొలగిపోకపోవడంతో ఆమె రావడానికి నిరాకరించింది. దీంతో సహనం కోల్పోయిన మణి చందర్, అడ్డుగా వచ్చిన మామ నారాయణతో తీవ్ర వాగ్వాదానికి దిగాడు. మాటమాట పెరగడంతో ఆవేశంతో రగిలిపోయిన అల్లుడు.. పక్కనే ఉన్న కర్రను తీసుకుని మామ నారాయణ తలపై బలంగా బాదాడు. దీంతో ఆయన తల పగిలి తీవ్ర రక్తస్రావమై కిందపడిపోయాడు. కళ్లముందే తండ్రిపై దాడి జరుగుతుండటంతో తట్టుకోలేకపోయిన మమత.. భర్తను అడ్డుకునేందుకు ప్రయత్నించింది. తండ్రిని కాపాడుకోవాలని చూసిన భార్యపై మణి చందర్ మృగంలా విరుచుకుపడ్డాడు. కసిగా ఆమెపై దాడి చేసి, అందరూ దిగ్భ్రాంతికి గురయ్యేలా భార్య ముక్కును పళ్లతో బలంగా కొరికేసాడు. భర్త కోరల దెబ్బకు మమత ముక్కు తీవ్రంగా తెగిపడి కిందపడిపోయింది. ఆమె తీవ్ర నొప్పితో పెడబొబ్బలు పెట్టినా వదలకుండా రాక్షసానందం పొందాడు.

# పేద ప్రజలకుబిఅండగా సీఎం సహాయబినిధి



**టీ మీడియా,సెప్టెంబర్16,ముదిగొండ :**

డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు సారంగా.. న్యూ లక్ష్మీపురం గ్రామంలో మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ అజ్గర్ సిఫారసు. మెరకు జోన్ ఇన్చార్జులు కందిమల్ల వీరబాబు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ అజ్గర్ మాట్లాడుతూ... పేద ప్రజలకు ఆపదలో ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రత్యేక చొరవ తీసుకొని ఎక్కడ లేని విధంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేయడం జరిగింది, గడ్డం ఉదయ్ కుమార్ 7,500/, మహమ్మద్ సలీ మున్నీసా బేగం గ్రామ సర్పంచ్ 27,000/, వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేయడం జరిగింది. అదేవిధంగా గౌరవ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేద ప్రజలకు ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అని అన్నారు. న్యూ లక్ష్మీపురం గ్రామంలో డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి కృషితో గ్రామ సర్పంచ్ గారికి ఇంటికెళ్లి రాజకీయాలకు అతీతంగా చెక్కు ఇచ్చిన న్యూ లక్ష్మీపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# వెంకటసాయి మిల్లులో

**⏭| రూ.23.80 కోట్ల సీఎంఆర్ గోల్‌మాల్!**




**టి మీడియా , సెప్టెంబరు 16 సూర్యాపేట :**

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రానికి చెందిన మాజీ మార్కెట్ ఛైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నేత వారసులకు చెందిన వెంకటసాయి రైస్‌మిల్‌లో రూ.23.80 కోట్ల విలువైన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారంలో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీంతో విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు మిల్లును సీజ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెంకటసాయి రైస్‌మిల్‌లో 2023–24, 2024–25, 2025–26 సంవత్సరాలకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారంపై విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రూ.23.80 కోట్ల విలువైన సీఎంఆర్‌కు సంబంధించి అవకతవకలు జరిగినట్లు గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. తనిఖీల అనంతరం మిల్లును అధికారులు సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా సివిల్ సప్లై మేనేజర్ శ్రీధర్‌రెడ్డి ఈ నెల 13న పెన్‌పహాడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ బాలు నాయక్ కేసు నమోదు చేశారు.

మిల్ యజమానులుగా ఉన్న తూముల భుజంగరావు వారసులు తూముల విజయ్, ఆయన కోడలు, మాజీ సర్పంచ్ తూముల శ్వేతపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీఎంఆర్ వ్యవహారంలో జరిగిన అవకతవకలపై దర్యాప్తు కొనసాగుతోందని ఎస్ఐ బాలు నాయక్ పేర్కొన్నారు.

# 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన

**టీ మీడియా,సెప్టెంబర్16,ముదిగొండ :**



ముదిగొండ గ్రామంలో రూ.22 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్యవేక్షించారు.ముదిగొండ గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న ఈ 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుచ్చి రామయ్య గారు, ముదిగొండ గ్రామశాఖ అధ్యక్షులు సామినేని నాగేశ్వరావు గారు, ఉపేంద్రయ్య గారు, కొమ్ము నరసింహారావు గారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, మౌలిక వసతుల ఏర్పాటుపై వివరాలు తెలుసుకుని, పనులు నిర్ణీత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తయ్యేలా సంబంధిత అంశాలను పరిశీలించారు. ముదిగొండ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడంలో ఈ ఆసుపత్రి నిర్మాణం కీలక ముందడుగుగా నిలవనుంది.

# భూక్యా ధర్మా నాయక్ నామినేషన్



**టీ మీడియా,సెప్టెంబర్16,ముదిగొండ :**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదివాసి డిపార్ట్మెంట్ అధ్యక్షులు,శాసనమండలి సభ్యులు కేతావత్ శంకర్ నాయక్ గారి ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా ఆదివాసీ(ఎస్.టి.) డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్ష పదవి కొరకు మధిర నియోజకవర్గం ముదిగొండ మండలం నుండి భూక్యా ధర్మా నాయక్ నామినేషన్ దరఖాస్తు పత్రాలను తెలంగాణ రాష్ట్ర ఆదివాసి కాంగ్రెస్ పార్టీ వైస్ చైర్మన్ మల్లికార్జున్ దరఖాస్తు చేయడం జరిగింది,చేయడం ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కిలారు అనిల్ ,ఖమ్మం జిల్లా ఆర్.టి.ఎ. మెంబర్ గజ్జెలి వెంకన్న ,జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు హుస్సేన్ ,జిల్లా నాయకులు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రవాణాపై నిఘా పెట్టండి

**⏭| పోలీసులకు సీపీ సూచన**



**టీ మీడియా, సెప్టెంబర్ 16, రామకృష్ణాపూర్;**

క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ ను బుధవారం రామగుండం పోలీస్ కమిషనర్ వార్షిక తనిఖీలో భాగంగా తనిఖీ చేశారు. స్టేషన్ కు చేరుకున్న సీపీకి ఎస్పై శ్రీధర్, సీఐ రమేష్ స్వాగతం పలికారు. స్టేషన్ ఆవరణలో మొక్క నాటిన అనంతరం రికార్డులు, సిబ్బంది బ్యారక్, రిసెప్షన్, 5 ఎస్ విధానం అమలును పరిశీలించారు. పెండింగ్ కేసులు, రౌడీషీటర్ల కదలికలు, పెట్రోలింగ్ పై ఎస్పై నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని, గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు నిఘా పెంచాలని, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ఎస్ఓపి అమలు చేయాలని సూచించారు. సీసీటీవీ ఏర్పాటులో మంచి ఫలితాలు సాధిస్తున్న సిబ్బందిని అభినందించారు.

# బీఆర్ఎస్ నేతలు భూములను బదిలీ చేసుకున్నారు

(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్టు రూ.1400 కోట్ల వాల్యూకు ఎలా వచ్చిందన్న సీఎం, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. 1982లో వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటు కాగానే కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే సభ నుంచి పారిపోయారని విమర్శించారు.

**మాఫియా చేతుల్లోకి కోట్ల మంది డేటా**

2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చలవిడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు.

తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

# డిగ్రీ కళాశాలలో ఓజోన్ దినోత్సవం

**టీ.మీడియా,సెప్టెంబర్16,చింతూరు:**
చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఎన్.మణిమాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ ముల్లి. శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెట్లను పెంచడం పర్యావరణహిత జీవన విధానాలను పాటించటం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. రసాయనిక శాస్త్ర అధ్యాపకులు డా. శివకృష్ణ మాట్లాడుతూ ఓజోన్ పొర క్షీణించడం వల్ల గ్లోబల్ వార్మింగ్, చర్మవ్యాధులు, కంటి సమస్యలు, రోగ నిరోధక శక్తి తగ్గడం వంటి దుష్పరిణామాలు వస్తాయని తెలియజేశారు.




జువాలజీ డిపార్ట్మెంట్ జి.సాయికుమార్ మాట్లాడుతూ వాతావరణంలో స్ట్రాటోస్పియర్ పొరలో ఉండే ఓజోన్ వాయువు సూర్యుని నుండి వచ్చే హానికరమైన అల్ట్రా వయోలెట్యు వి కిరణాల నుండి భూమిని ఎలా రక్షిస్తుందో వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. పద్మ, ఎం.రాకేష్ రాజ్, డా. ఝూన్సీ, బి. శ్రీనివాసరావు, ఆనంద్, కోట్ల. లక్ష్మీ ప్రసన్న, కే.కీర్తి, విద్యార్థినీ, విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది హాజరయ్యారు.

# టీడీపీ శ్రేణుల సమావేశం.. 97 కుటుంబాల చేరిక

**టీ.మీడియా,సెప్టెంబర్16, చింతూరు:**
చింతూరు మండల టీడీపీ కార్యకర్తలు, పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశం మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, పోలవరం జిల్లా ఎన్నికల పరిశీలకులు కె సత్తిబాబు,మాజీ ఎమ్మెల్యేలు,సీతంశెట్టి వెంకటేశ్వర్రావు,బాబు రమేష్,వంతల రాజేశ్వరి,మాజీ మండల పార్టీ అధ్యక్షులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలి.. గ్రామస్థాయిలో పార్టీని ఎలా బలోపేతం చేయాలి.. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ఎలా ముందుకు సాగాలనే అంశాలపై సమావేశంలో చర్చించారు.ఇదే కార్యక్రమంలో టీడీపీలో భారీగా చేరికలు చోటుచేసుకున్నాయి. పేగ పంచాయతీ పరిధిలోని అహ్మదల్లిపేట, పేగ, కొల్లిగొండ గ్రామాలకు చెందిన సుమారు 60 కుటుంబాలు



ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ చేతుల మీదుగా టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు.అలాగే కొత్తపల్లి పంచాయతీకి చెందిన 37 కుటుంబాలు కూడా టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. మొత్తంగా 97 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు పార్టీ నాయకులు తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమకు నచ్చడంతోనే టీడీపీలో చేరుతున్నట్లు కొత్తగా పార్టీలో చేరిన వారు వెల్లడించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

అనంతరం చింతూరు గ్రామపంచాయతీ పరిధిలో సినిమా హాల్ సెంటర్ నుంచి వాడవజారు వరకు నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.టీడీపీ సమావేశం, భారీగా కుటుంబాల చేరికలు, అనంతరం సీసీ రోడ్డు శంకుస్థాపనతో చింతూరులో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# నోటీసులతోనే సరిపెడతారా..?హద్దులు తేల్చేదెవరు?

**⏭|సర్వే నంబర్ 171పై**
**కొనసాగుతున్న సందిగ్ధత**



**టీ మీడియా,సెప్టెంబర్16,సింగరేణి(కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి గ్రామంలోని సుబ్బయ్యకుంట చెరువు శిఖం భూముల వ్యవహారం రోజురోజుకూ చర్చనీయాంశంగా మారుతోంది.సర్వే నంబర్ 171లోని చెరువు శిఖం భూమిలో ఆక్రమణలు జరిగాయనే ఫిర్యాదుల నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ సంబంధితులకు నోటీసులు జారీ చేసినప్పటికీ,అసలు చెరువు హద్దులు ఎక్కడి వరకు ఉన్నాయన్నది సర్వే ద్వారా తేల్చడంలో జాప్యం జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.చెరువు శిఖం భూమిలో కొంత భాగాన్ని వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తున్నారని, మరికొన్ని ప్రాంతాల్లో ప్లాట్లు చేసి విక్రయించారనే ఆరోపణలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ప్రభుత్వ రికార్డుల ప్రకారం చెరువు హద్దులను నిర్ధారిస్తేనే వాస్తవ పరిస్థితి బయటపడుతుందని స్థానికులు అంటున్నారు.ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేయడంతో పాటు సర్వే కోసం రెవెన్యూ శాఖను కోరినట్లు సమాచారం.అయితే ఇప్పటికీ హద్దుల నిర్ధారణ పూర్తికాకపోవడంతో'నోటీసులు ఇచ్చారు సరే.. సర్వే ఎప్పుడు?' అనే ప్రశ్న తెరపైకి వస్తోంది.

**రికార్డులు తీస్తే అసలు లెక్క తేలదా.?**

రెవెన్యూ,ఇరిగేషన్ శాఖల వద్ద ఉన్న రికార్డులు,పాత మ్యాపులు,ఎఫ్ఎంబీ వివరాలను పరిశీలించి క్షేత్రస్థాయిలో సంయుక్త సర్వే నిర్వహిస్తే చెరువుకు సంబంధించిన అసలు విస్తీర్ణం,హద్దులు స్పష్టమవుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.శిఖం పరిధిలో నిర్మాణాలు, ఇతర వినియోగం ఉన్నట్లయితే వాటి చట్టబద్ధత కూడా అధికారుల పరిశీలనలో తేలాల్సి ఉందంటున్నారు.

**జాప్యం జరిగితే ఆక్రమణలకు అవకాశం..?**

చెరువు హద్దుల విషయంలో స్పష్టత రాకపోతే భవిష్యత్తులో మరిన్ని వివాదాలు తలెత్తే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఒకసారి భూమి స్వరూపం మారి నిర్మాణాలు పెరిగిన తర్వాత చెరువు భూములను తిరిగి పరిరక్షించడం కష్టంగా మారుతుందని అంటున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలి**

సుబ్బయ్యకుంట వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి రెవెన్యూ,ఇరిగేషన్,పంచాయతీ అధికారులతో సంయుక్త సర్వే నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.సర్వే నంబర్ 171లో చెరువు శిఖం ఎంత? ప్రస్తుతం ఎంత భూమి అందుబాటులో ఉంది?ఎక్కడైనా ఆక్రమణలు జరిగాయా?అనే అంశాలను అధికారికంగా తేల్చి,హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.నోటీసులు జారీ చేయడంతో చర్యలు ముగిసినట్లు కాకుండా..సర్వే చేసి హద్దులు నిర్ధారించి,చెరువు భూమిని పరిరక్షించే వరకు చర్యలు కొనసాగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఏఐటీయూసీ నూతన కార్యాలయం ప్రారంభం

**టీ మీడియా ,సెప్టెంబర్ 16, రామకృష్ణాపూర్;**
తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా రామకృష్ణాపూర్ సూపర్ బజార్ లో ఏఐటీయూసీ నూతన కార్యాలయాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య బుధవారం ప్రారంభించారు. యూనియన్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నేతృత్వంలో సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు.ఆ మహత్తర పోరాట చరిత్రను విస్మరించడం చరిత్రను వక్రీకరించడమేనని అన్నారు. మాదే చరిత్ర అంటూ బీజేపీ ప్రచారం చేసుకోవడం



విడ్డూరమని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు ఇప్పకాయల లింగయ్య,సుదర్శన్, మిట్టపల్లి శ్రీనివాస్,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎండి అక్బర్ అలీ, సత్యనారాయణ,కౌన్సిలర్లు కౌడగాని సాంబయ్య,మద్దెల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం




**టీ.మీడియా,సెప్టెంబర్16,చింతూరు:**
చింతూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈరోజు ఎంపీటీసీ /జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ముసాయిదా ప్రచురణపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో ఎండిఓ సుందం శ్రీనివాస దొర బుధవారం సమావేశం నిర్వహించారు . చింతూరు మండల పరిధిలోని ఎంపీటీసీ /జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను 15.09.2026న ప్రచురించడం జరిగిందన్నారు .ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు లేదా మార్పులు, చేర్పులకు సంబంధించిన సూచనలు తెలియజేయుటకు ఈ సమావేశం ఏర్పాటు చేసామని తెలిపారు .ఈ సమావేశంలో ప్రచురించబడిన పోలింగ్ స్టేషన్ల వివరాలను పరిశీలించిన అనంతరం, ప్రస్తుత ముసాయిదాలో పేర్కొన్న పోలింగ్ స్టేషన్లకు ఎటువంటి మార్పులు లేదా చేర్పులు అవసరం లేదని సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజేశారుఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ (టీడీపీ ), జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ (బిజెపి ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైస్సార్సీపీ ), సీపీఐ(ఎం), సీపీఐ పార్టీల ప్రతినిధులతో పాటు చింతూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, జడ్పీటీసీ సభ్యులు తదితర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఎంపీటీసీ /జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ముసాయిదాపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించే ప్రక్రియలో భాగంగా ఈ సమావేశం నిర్వహించినట్లు చింతూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుందం శ్రీనివాసు దొర ఒక ప్రకటన లో తెలియజేశారు.

# భూ రీ-సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

**⏭|జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**టి మీడియా, ,సెప్టెంబర్16, ఖమ్మం రూరల్:**
భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వేకు క్షేత్రస్థాయిలో ఉన్న భూమే ప్రామాణికమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. రైతులు, భూ యజమానుల సమక్షంలో రోవర్, ట్యాబ్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలతో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే విధానం, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి భూ రీ-సర్వే ఉద్దేశ్యం, చేపడుతున్న ప్రక్రియపై అవగాహన కల్పించారు. రైతుల సందేహాలు, అనుమానాలను అడిగి తెలుసుకుని, వాటిని నివృత్తి చేశారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అపోహలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే ప్రతి అంశాన్ని పరిశీలించి నమోదు చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమం న్నీ ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూమి ఉండి పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు, పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి వివరాలకు రికార్డుల్లోని వివరాలకు పొంతన లేని వారు, అలాగే రికార్డుల్లో భూమి వివరాలు నమోదు కాని సందర్భాలను రీ-సర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు.భూ రీ-సర్వేలో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎవరు భూమిని సాగు చేస్తున్నారు, వారి పేరుపై ఎంత విస్తీర్ణం నమోదై ఉంది, పట్టాదారు పాస్‌బుక్ ఉందా లేదా, రికార్డుల్లో నమోదైన వివరాలు క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోతున్నాయా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలని అన్నారు.పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణం మధ్య తేడా ఉందా లేదా అనే విషయాన్ని చుట్టుపక్కల రైతుల సమక్షంలో కొలతలు నిర్వహించి నిర్ధారించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో పంచనామా నిర్వహించి వివరాలను నమోదు చేయాలని, విస్తీర్ణంలో ఎక్కువ లేదా తక్కువ ఉన్నట్లయితే అందుకు గల కారణాలను పూర్తిగా పరిశీలించి, సంబంధిత భూ యజమానికి వివరాలను తెలియజేసి, నిబంధనల ప్రకారం వారి సమ్మతిని నమోదు చేయాలని అన్నారు.ప్రతి భూ రీ-సర్వే సమయంలో సంబంధిత రైతుల వద్ద ఉన్న పట్టాదారు పాస్‌బుక్‌లు, పాత పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సాగుకు సంబంధించిన ఇతర ఆధారాలను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సర్వే నోటీసు అందించినట్లు రసీదు తీసుకోవడం, ఫోటోలతో కూడిన పంచనామా రూపొందించడం, ఆధార్, మొబైల్ నంబర్ వంటి వివరాలను నమోదు చేయడం వంటి ప్రక్రియలను తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు, పట్టాదారు వివరాలను పాత రికార్డులతో సరిపోల్చి ఖచ్చితంగా నమోదు చేయాలని అన్నారు. ఏ ఒక్క అర్హుడి భూమి వివరాలు కూడా రీ-సర్వేలో తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.రికార్డుల్లో ఉన్న వివరాలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు మధ్య ఉన్న విస్తీర్ణ తేడాలను సాంకేతికంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. మ్యాప్‌లు, సర్వే నంబర్లు, క్షేత్రస్థాయి కొలతలను సమన్వయం చేసి భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా పక్కా రికార్డులను రూపొందించాలని అన్నారు.ఆధునిక రోవర్, ట్యాబ్ తదితర సర్వే పరికరాలను సమర్థవంతంగా వినియోగించి ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా పరిశీలించాలని తెలిపారు. అర్హులైన భూ యజమానులు, సాగుదారులకు భూ హక్కులపై స్పష్టత కల్పించే విధంగా రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేసి, అర్హులకు పట్టాదారు పాస్‌బుక్‌లు అందేలా రికార్డులను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు.రీ-సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి సంబంధిత పత్రాలను అధికారులకు అందజేస్తూ పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# సక్రియ కుటుంబానికి నాయకుల పరామర్శ



**టీ మీడియా,సెప్టెంబర్16,సింగరేణి(కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం సూర్యతండా వార్డు సభ్యుడు అజ్మీర లకుపతి తండ్రి అజ్మీర సక్రియ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.బుధవారం సూర్యతండాలో సక్రియ సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సూర్యతండా సర్పంచ్ బానోత్ రాందాస్ నాయక్, బీఆర్ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న హాజరై సక్రియ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం మృతుని కుమారుడు అజ్మీర లకుపతితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.సక్రియ మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సీసీ రోడ్లభూమిపూజ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మెన్

**టి మీడియా ,సెప్టెంబర్ 16,ఆత్మకూరు :**
వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలో రెండో వార్డ్ లో సిసి రోడ్డు పనులు పూజ చేసి ప్రారంభించడం జరిగింది. మహేష్ మొబైల్ షాప్ నుంచి మార్కెట్ యార్డ్ వరకు రోడ్డు ఇరువైపులా వేయించడం జరుగుతుంది. ఇట్టి కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ గోపాల నాగమణి రాజేష్ , మున్సిపల్ వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు , మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి రహమతుల్లా, మాజీ మండల అధ్యక్షులు పరమేష్ , తులసి రాజు యాదవ్ , మున్సిపల్ కమిషనర్ ఎ.నరేష్ కుమార్ , వార్డు కౌన్సిలర్లు తిరుపతి , లలిత , శంకరమ్మ , దండు శ్రీనివాసులు , భరత్ , జిందె జ్యోతి శ్రీనివాస్ , సద్దుల తులసి వెంకట్రాములు, జుబేదా బేగం , కో ఆప్షన్ సభ్యులు కడియాల శ్రీనివాసులు యాదవ్ , సౌజన్య గంగాధర్ ,



ఎండి జాంగిర్ , సన , మండల అధ్యక్షులు నాగేష్ , టౌన్ అధ్యక్షులు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేష్ , భాస్కర్ , జుబేర్ , బుచ్చన్న , తదితరులు పాల్గొన్నారు.

# సరైన పత్రాలు సమర్పించాలి

**టీ మీడియా ,సెప్టెంబర్ 16 ,ఆత్మకూరు:**
అత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలో సర్ ప్రక్రియలో భాగంగా, మున్సిపల్ కమిషనర్ ఎ. నరేష్ కుమార్ ఆధ్వర్యంలో సర్ హియరింగ్ కార్యక్రమాన్నినిర్వహించారుఈ సందర్భంగా హియరింగ్‌కు హాజరైన ఓటర్లకు సంబంధించి సమర్పించిన దరఖాస్తులు, ఆధార పత్రాలు సంబంధిత రికార్డులను పరిశీలించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా, అవసరమైన పత్రాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత బి ఎల్ ఓలు, వార్డు అధికారులు కంప్యూటర్ ఆపరేటర్లకు కమిషనర్ సూచించారు.సర్ హియరింగ్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థవంతంగా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని ఆయన ఆదేశించారు.తేదీ 16 నాడు పోలింగ్ బూత్ అంగన్వాడీ కేంద్రం, జాతర మైదానం , 17 నాడు పోలింగ్ బూత్ పాత విశ్వభారతి స్కూల్ 18 నాడు పోలింగ్ బూత్ మేస్త్రీ కమ్యూనిటీ భవనం,19 నాడు



పోలింగ్ బూత్ సాయి వాణి ఫంక్షన్ హాల్అంగన్వాడీ కేంద్రం, 22 నాడుూజ కమ్యూనిటీ భవనం, 5వ వార్డులో హియరింగ్ నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు.ప్రజలు తమ హియరింగ్ తేదీన సంబంధిత కేంద్రానికి హాజరై, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించి అధికారులకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి కౌన్సిలర్లు దండు శ్రీనివాసులు,అల్లి శంకరమ్మ, జుబేదా బేగం , బి ఎల్ వోలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పైపు లైన్ లీకేజీ వృధాగా నీరు

**టీ మీడియా, సెప్టెంబర్ 17 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని విద్యా నగర్ కాలనీలోనీ బోరు మోటారు వద్ద మూడు నాలుగు రోజులుగా పైపు లైన్ లీకేజీ జరిగి నీళు ళ వృథాగా పోతున్నాయి లేనినో ప్రభావం వల్ల వర్షాలు లేక నీటి ఎద్దడి వున్న సమయంలో లీకేజీతో నీళ్ళు వృథాగా పోవడం బాధాకరమని బీ సి కాలనీ వాసులు విచారం వ్యక్తం చేశారు త్వరగా పైపు లైన్ లీకేజీనీ సరి చేయలని మున్సిపల్ అధికారులను ప్రజా ప్రతినిధులను కోరారు



# రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా

**● ఏ ఐ కె ఎమ్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు: బిక్షపతి**

**టీ మీడియా, సెప్టెంబర్ 16 ,కూసుమంచి :**
కేంద్రంలో నరేంద్ర మోడీ అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి పిలుపునిచ్చారు. ఖమ్మంలో జరుగునున్న జాతీయ మహాసభలను విజయవంతం చేసేందుకు బుధవారం మండల కేంద్రం కూసుమంచి లో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశములో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిక్షపతి మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ అనుసరించే విధానాల వల్ల రైతుల, కూలీల నికర ఆదాయం 1.4 బి 1.06 శాతం తగ్గి, కార్పొరేట్ల ఆదాయం వందల రేట్లు పెరిగిందని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే మద్దతు ధర తో పాటు, పంటను కొనుగోలు చేసి 2022 నాటికి రైతుల ఆదాయాన్ని పెంచుతామని చెప్పి, రైతులను మోసం చేసిందని ఆయన ఆరోపించారు.




అమెరికా యూరోప్ దేశాలతో స్వేచ్ఛవాణిజ్య అసమాన ఒప్పందాల నుండి భారత వైదొలగాలన్నారు. 2025 విద్యుత్.విత్తన బిల్లుల ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, 2022 అటవీ సంరక్షణ నియమాలను రద్దుచేసి ఆదివాసి గిరిజనుల హక్కుల కాపాడాలన్నారు. రైతాంగం పంటలకు ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించి.రైతు రుణ విమోచన చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సూపర్ ఎల్ నీ నో ప్రభావంతో నష్టాన్ని అంచనా ఏసి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు బండారి ఐలయ్య. ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బజ్జూరి వెంకటరామిరెడ్డి, వై ప్రకాష్. ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వెంకన్న. మందుల రాజేంద్రప్రసాద్. పి వై ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, ఏ ఐ కె ఎమ్ ఎస్ కూసుమంచి మండల ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి వీరయ్య. నాగయ్య. సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ ఎల్ ఎన్ స్కూల్ లను సందర్శించిన ఎం ఈ వో

**టీ మీడియా సెప్టెంబర్ 17 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం మండల విద్యాధికారి జయరాములు బుదవారం మండలంలోని పలుగ్రామాల్లో సుగూరు బు నియాదిపూర్ ఎఫ్ ఎల్ ఎన్ స్కూలులను తనిఖీ చేశారు విద్యార్థుల హాజరు పట్టిక ప్రతిభ ఉపాధ్యాయుల బోధనా పద్ధతి డైరీ లను పరిశీలించారు సి గ్రేడ్ విద్యార్థులకు నిర్వహిస్తున్న రెమిడిఎల్ తరగతులపై తగు సూచనలు చేశారు ప్రోగేస్ కార్డులపై తల్లి తండ్రుల సంతకాలు చూసుకోవాలని అన్నారు సుగూరు జిల్లా పరిషత్ హై స్కూల్ పని తీరు ను పరిశీలించారు



# పశువుల ఆరోగ్యమే.. రైతుకు భరోసా



**● విశ్వనాథపల్లిలో ప్రత్యేక పశువైద్య శిబిరం**

**టీ మీడియా,సెప్టెంబర్16,సింగరేణి(కారేపల్లి):**
పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు సంతానోత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం సింగరేణి మండలం విశ్వనాథపల్లిలో ప్రత్యేక పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు.గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రాజు రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు.ఉప సర్పంచ్ బొమ్మల ధనమ్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సింగరేణి మండల పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ పశువుల్లో గర్భకోశ సంబంధిత వ్యాధులను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు.పశువుల ఆరోగ్యంతో పాటు సంతానోత్పత్తికి సమతుల్య పోషకాహారం ఎంతో ముఖ్యమని చెప్పారు.రైతులు పశువులకు అవసరమైన ఖనిజ లవణాలను క్రమం తప్పకుండా అందించాలని సూచించారు.పశు వుల్లో ఎద లక్షణాలను రైతులు సకాలంలో గుర్తించి సరైన సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించడం ద్వారా సంతానోత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని వివరించారు.ఆధునిక పశు పోషణ పద్ధతుల్లో భాగంగా సెక్స్ సార్టెడ్ సీమెన్ వినియోగం,దాని ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు.పశువులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.ఈ శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు,సలహాలు అందించారు.పశువుల ఆరోగ్య సంరక్షణ,పోషణ,గర్భకోశ సమస్యలు,సంతానోత్పత్తి తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గోపాలమి త్రసూపర్వైజర్వెంకటేష్, గోపాలమిత్రులుమంగయ్య,శ్రీకాంత్,సమ్మయ్య,రా మారావు,రవి,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యునిగా నరసింహ సాగర్



**టీ మీడియా ,సెప్టెంబర్ 16 ,అమరచింత :**
వనపర్తి జిల్లా అమరచింత మండలానికి చెందిన నరసింహ సాగర్ ని కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమించిన సందర్భంగ సత్కరించిన అమరచింత నాయకులు, నారాయణపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులుగా నియామకం అయినటువంటి టైలర్ నరసింహసాగర్ ని ఘనంగా సత్కరించిన అమరచింత అధ్యక్షురాలు డాక్టర్ లావణ్య, సీనియర్ నాయకులు నరాల నారాయణ, బిజెపి మాజీ జిల్లా కార్యదర్శి మరాఠీ అశోక్ , క్యామ భాస్కర్, బూత్ అధ్యక్షులు, క్యామ కుమార్, తోకలి వెంకటేష్, వీరన్న గౌడ్ ,ఉగ్ర నరసింహ, చేనేత కమిటీ అధ్యక్షులు తిరుమల రఘురాం, మహంకాళి బాల్ కుమార్ ఉదయ్ గౌడ్ మొదలగువారు ఈ కార్యక్రమంలో పాల్గొని జిల్లా కమిటీకి ఎన్నికైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ శు భాకాంక్షలు తెలిపారు.

# ప్రధానమంత్రి కి పాలాభిషేకం



**టీ మీడియా, సెప్టెంబర్ 17 ,పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం ప్రతి పేద మధ్యతరగతి ప్రజల సొంతింటి కల నెరవేరాలని ప్రతి వ్యక్తి ఆత్మాభిమానంతో జీవించాలని ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి 2 లక్షల ఇండ్లు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం ఈ సందర్భంగా నేడు పెబ్బేర్ టౌన్ రూరల్ ఆధ్వర్యంలో సుభాష్ చౌక్ లో భారతీయ జనతా పార్టీ పెబ్బేరు పట్టణ అధ్యక్షుడు క్రాంతి కుమార్ అధ్యక్షతన ప్రధానమంత్రి నరేంద్రమోధి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బా జ పా శ్రేణులు ఈ కార్యక్రమంలో పట్టణ మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# జెడ్ పి హై స్కూల్ లో ఎస్ జీ ఎఫ్ క్రీడలు ప్రారంభం

**టీ మీడియా, సెప్టెంబర్ 17 పెబ్బేరు:**
పెబ్బేరు పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూలులో మండల స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడలు ప్రారంభం అయ్యాయి 350 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటున్నారు ఈ పోటీల్లో కొకో కబడ్డీ వాలీబాల్ లు ఉన్నాయి ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని పి ఇ టీ కురుమయ అన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అధితులుగా వచ్చిన నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని క్రీడలతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.

